క్లుప్తంగా

ఉత్సవాలను విజయవంతం చేద్దాం



ఊట్కూరు: శరన్నవరాత్రి ఉత్సవాలను విజయవంతం చేద్దామని శ్రీశ్రీ ఆదిత్య పరాశ్రీ స్వామి అన్నారు. మండలంలోని బిజ్వార్‌లో అంబత్రయ క్షేత్రంలో ఈ నెల 22 నుంచి జరిగే బ్రహ్మోత్సవాల గోడపత్రికను ఆదివారం ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 22 నుంచి అక్టోబర్ 2 వరకు అంగరంగ వైభవంగా బ్రహ్మోత్సవాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. అమ్మవారికి రోజు అలంకరణ, అమ్మవారి ఊరేగింపు, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 21 నుంచి భవాని మాత మాల ధారణ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. భక్తులు భారీగా తరలివచ్చి ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

ఆలయానికి మైక్ సెట్ వితరణ



మరికల్: మండలకేంద్రంలోని ఆంజనేయస్వామి ఆలయానికి ఆదివారం దాతలు మైక్ సెట్ వితరణ చేశారు. గ్రామానికి చెందిన మేకల జయలక్ష్మి, చెన్నకేశవులు దంపతులు ఆదివారం మైక్ సెట్, భగవద్గీత శ్లోకం తదితర సామగ్రి హనుమాన్ యూత్ కమిటీ సభ్యులకు అందజేశారు. మరింత మంది దాతలు ముందుకువచ్చి ఆలయ అభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు చంద్రప్ప, ముకుందారెడ్డి, నర్సిరెడ్డి, రాజేష్, ఆంజనేయులు, నిఖిల్, రఘు, లక్ష్మీకాంత్, రఘు, పట్నయ్య, నర్సిములు, రాంరెడ్డి, యాదయ్య, లక్ష్మయ్య పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్ల సమస్యల పరిష్కారానికి కృషి



నారాయణపేట రూరల్/నారాయణపేట: జిల్లాలోని ఫొటోగ్రాఫర్‌ల సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని మంత్రి వాకిటి శ్రీహరి, డీసీసీ మాజీ అధ్యక్షుడు కుంభం శివకుమార్ రెడ్డి అన్నారు. ఆదివారం పేటలోని ఫొటోగ్రాఫర్లు పట్టణ ఫొటో యూనియన్ ఆధ్వర్యంలో డీసీసీ కార్యాలయంలో మంత్రిని కలుసుకున్నారు. ఈ సందర్భంగా హైదరాబార్‌లో ఈ నెల 19న జరిగే ఫొటో ఎగ్జిబిషన్‌కు ఆహ్వానించి అనంతరం కరపత్రాలను విడుదల చేశారు. మూడు రోజులపాటు జరిగే ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించాలని కోరారు. అనంతరం వారి సమస్యలను వివరించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు రాజేష్, రఘు బాబు, బస్వరాజ్, వినోద్ పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కు అందజేత



మరికల్: మండలంలోని చిత్తనూర్ గ్రామానికి చెందిన బోయ నర్సింములుకు మంజూరైన సీఎం సహాయ నిధి చెక్కును ఆదివారం అందజేశారు. వైద్య చికిత్స నిమిత్తం రూ.18 వేలు మంజూరు కాగా స్థానిక కాంగ్రెస్ నాయకులు ఆదివారం బాధితుడికి అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మురళి, నర్సింములు, శేఖర్‌రెడ్డిలు పాల్గొన్నారు.

క్రికెట్ చాంపియన్‌గా ఊట్కూరు జట్టు



ఊట్కూరు: నియోజకవర్గ స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లో ఊట్కూరు ఉపాధ్యాయుల జట్టు ప్రతిభ కనబరిచి విజేతగా నిలిచింది. మక్తల్ మినీ స్టేడియంలో ఆదివారం నిర్వహించిన టోర్నమెంట్‌లో ఊట్కూరు, కృష్ణ, నర్వా, మక్తల్, మాగనూర్ మండలాలకు చెందిన ఉపాధ్యాయులు జట్టుగా ఏర్పడి టోర్నమెంట్‌లో పాల్గొన్నారు. తుదిపోరులో ఊట్కూరు జట్టు విజేతగా నిలిచింది. జిల్లా డీవైఎస్ఓ వెంకటేశ్ ఆధ్వర్యంలో మెమోంటోను అందజేసి అభినందించారు. టోర్నమెంట్‌లో ఉపాధ్యాయులు విక్టర్‌పాల్, సత్యపాల్, ఆనంద్, హర్షద్, గోపాల్, మహేష్, శ్రీధర్ పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు భద్రత ఏది?



మురుగు కాల్వలను శుభ్రం చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు (ఫైల్)

- జీపీ కార్మికులకు రక్షణ కరువు
- పొంచి ఉన్న అనారోగ్యం ముప్పు
- ఏడాదిగా అందని సామగ్రి

మాగనూర్: గ్రామపంచాయతీల పరిధిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు భద్రత కరువైంది. కనీస జాగ్రత్తలు లేకుండానే వారితో పనులు చేయిస్తున్నారు. అసలే వానాకాలం కావడంతో అనారోగ్యం బారినపడే అవకాశం ఉంది. గ్లౌజులు, మాస్కులు, సబ్బులు ఇతర సామగ్రి అందించకపోవడంతో కార్మికులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఏడాదిగా పంచాయతీయల పరిధిలో పనిచేస్తున్న కార్మికులకు యూనిఫాం, గ్లౌజులు, షూస్, సబ్బులు ఇతర లిక్విడ్స్ అందడం లేదు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు శుభ్రతను అందించేందుకు నిరంతరాయంగా సేవలందిస్తున్న పారిశుద్ధ్య కార్మికులు తగిన భద్రత పరికరాలు లేక.. పనులు చేసేందుకు నిత్యం అవస్థలు పడుతున్నారు.

ఏడాదిగా అందని సామగ్రి

రోజూ తెల్లవారుజామునే వీధుల్లోకి వచ్చి చెత్తను శుభ్రం చేసే సిబ్బంది అనారోగ్యానికి గురి కాకుండా ప్రభుత్వం ఏటా రెండు జతల యూనిఫాంలు, రెండు జతాల షూలు, మాస్కులు, రెయిన్‌కోట్స్, సబ్బులు, శానిటైజర్లు అందిస్తుంది. అయితే ప్రస్తుతం ఏడాది నుంచి రక్షణ కవచాలు అందించడం లేదు. వాన, చలి, ఎండ అనే తేడా లేకుండా శ్రమించే కార్మికులకు భద్రత లభించకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. మోకాళ్ల లోతు బురదలో దిగి దుర్గంధం వెదజల్లుతున్నప్పటికీ పనులు చేయాల్సి వస్తుందని వాపోతున్నారు. డ్రెయినేజీలో మురుగు తొలగించే సందర్భంలో మాస్కులు లేకపోవడంతో దుర్వాసనతో కార్మికులు అనారోగ్యానికి గురికావాల్సి వస్తోంది.

నెలకో.. మూడు నెలలకో..

ప్రతి గ్రామపంచాయతీ పరిధిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు నిధులను బట్టి నెలకో, మూడు నెలలకో రక్షణ కవచాలు సమకూర్చాల్సి ఉంది. ఎన్నో గ్రామాల్లో నిధులు లేమి కారణంగా ఏడాదిగా పారిశుద్ధ్య కార్మికులకు రక్షణ సామగ్రి అందడం లేదు. కార్మికుల సంక్షేమం, ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని రక్షణ పరకరాలు తక్షణమే అందించాల్సిన అవసరం ఉంది.

వ్యాధుల బారిన పడుతున్నాం

ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో రోడ్లు, వీధులు మొత్తం బురదమయంగా మారుతుండటంతో శుభ్రం చేయడానికి ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. షూలు, మాస్కులు వంటి రక్షణ సామగ్రి లేకపోవడంతో విధుల్లో ఇక్కట్లు ఎదుర్కొంటున్నాం. ఇప్పటికే చాలా సార్లు వ్యాధుల బారిన పడి ఆర్థికంగా చితికిపోతున్నాం.

–తిప్పమ్మ, మాగనూర్ పంచాయతీ కార్మికురాలు

జీతాలు కూడా ఇవ్వడం లేదు

ఏడాదిగా పంచాయతీయల పరిధిలో పనిచేస్తున్న కార్మికులకు యూనిఫాం, గ్లౌజులు, షూస్, సబ్బులు ఇతర లిక్విడ్స్ అందడం లేదు. డ్రెయినేజీలలో దిగి పనిచేయాలంటే చాలా ఇబ్బందులు పడుతున్నాం. దీనికి తోడు మూడు నెలలుగా జీతాలు అందడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమకు సరైన సౌకర్యాలు కల్పించడంతో పాటు పెండింగ్ జీతాలు విడుదల చేయించాలి.

–అశోక్, మాగనూర్

నివేదిక పంపించాం

పంచాయతీ కార్యదర్శులు తమ జీపీ పరిధుల్లో పనిచేసే పారిశుద్ధ్య కార్మికుల కోసం రక్షణ సామగ్రి సమకూర్చాలని ఉన్నతాధికారులకు నివేదిక అందించాం. నిధులు విడుదల అయితే వెంటనే కార్మికుల రక్షణ కవచాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం.

–శ్రీనివాసులు, ఎంపీడీవో మాగనూర్

ఉపాధ్యాయుల విజ్ఞానయాత్రపై విమర్శలు



పుణ్యక్షేత్రాల సందర్శనలో ఉపాధ్యాయులు

నారాయణపేట రూరల్: ప్రభుత్వ ఉపాధ్యాయులు సమయం, సందర్భం లేకుండా టూర్‌లకు వెళ్లడం విమర్శలకు తావిస్తోంది. ఇటీవల జిల్లాకు చెందిన పలువురు ప్రభుత్వ ఉపాధ్యాయులు సైన్స్ ఫోరం ఆధ్వర్యంలో శ్రీహరికోట పర్యటనకు వెళ్లారు. అయితే సిలబస్ పూర్తి కాలేదని ఒకవైపు విద్యార్థులు కుస్తీలు పడుతుంటే ఉపాధ్యాయులు మాత్రం శ్రీహరికోట సందర్శనకు వెళ్లి అక్కడి నుంచి శ్రీకాళహస్తి, నందలూరు లోని సౌమ్యనాథ ఆలయం, ఒంటిమిట్ట రామాలయం, మహానంది తదితర పుణ్యక్షేత్రాలతో పాటు సముద్రం దగ్గరకు వెళ్లి బీచ్‌ను సందర్శించారు. దీంతో ఉపాధ్యాయులు విజ్ఞానయాత్ర పేరిటా విహారయాత్రకు వెళ్లారంటూ పలువురు సీనియర్ టీచర్లు విమర్శలు గుప్పిస్తున్నారు.

ప్రభుత్వ టీచర్లు.. ప్రైవేట్ ట్రావెల్స్

జిల్లా వ్యాప్తంగా 129 మంది ఫిజికల్ సైన్స్, 116 మంది బయో సైన్స్ టీచర్లతో కలిపి మొత్తం 245 మంది సైన్స్ టీచర్లు ఉన్నా కేవలం 70 మందిలోపే విజ్ఞాన యాత్రకు వచ్చేందుకు ఇష్టత చూపించినట్లు అధికార జాబితా చెప్తుంది. అయితే ఆర్టీసీ బస్సులు అందుబాటులో ఉన్నా ప్రైవేటు ట్రావెల్స్ బస్సులలో వెళ్లడం మరింత వివాదాస్పదంగా మారింది. సైన్స్ ఫోరం ఆధ్వర్యంలో జరిగిన ఈ పర్యటన విషయంలో చివరి వరకు విద్యాశాఖ అధికారులు, యూనియన్ నేతలను సంప్రదించకుండా ఏకపక్షంగా వ్యవహరించినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.



బీచ్‌లో ఉపాధ్యాయులు

శ్రీహరికోట వరకే అనుమతి

విజ్ఞానం పేరిటా ఉపాధ్యాయులు విహారయాత్రకు వెళ్లడంపై డీఈఓ గోవిందరాజును వివరణ కోరగా సైన్స్ ఫోరం విజ్ఞప్తి మేరకు విద్యార్థులకు ఉపయోగపడుతుందనే ఉద్దేశంతో శ్రీహరికోట వీక్షణకు అనుమతి ఇచ్చినట్లు తెలిపారు. ఇస్రో చైర్మన్‌కు పెట్టిన దరఖాస్తు మేరకు ఈ నెల 12న సందర్శనకు అవకాశం కల్పించాం. అలాగే స్థానిక జిల్లా కలెక్టర్ పర్మిషన్‌తో యాత్రకు వెళ్లిన రోజు ఉపాధ్యాయులకు ఆన్ డ్యూటీ సౌకర్యం కల్పించాం. అయితే వరుసగా రెండు రోజులు సెలవు రావడంతో వారి వ్యక్తిగత డబ్బులతో శ్రీకాళహస్తి తదితర పుణ్యక్షేత్రాలు కూడా సందర్శిస్తున్నట్లు డీఈఓ వెల్లడించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో ప్రభుత్వ కళాశాల విద్యార్థులు



అపూర్వ సమ్మేళనంలో డీవీఎం ఎయిడెడ్ పాఠశాల విద్యార్థులు

నారాయణపేట రూరల్: జిల్లా కేంద్రంలోని దయానంద విద్యా మందిర్ పాఠశాలలో 1990–91లో టెన్త్ చదువుకున్న విద్యార్థులు ఆదివారం స్థానిక లక్ష్మీ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో కలుసుకున్నారు. దాదాపు 35 ఏళ్ల తర్వాత కలుసుకొని ఒకరి గురించి ఒకరు తెలుసుకొని రోజంతా ఉత్సాహంగా గడిపారు. అంతకుముందు తమకు విద్యాబోధన చేసిన ఉపాధ్యాయులను శాలువా, జ్ఞాపికతో సన్మానించారు. అలాగే మృతి చెందిన టీచర్లు, తోటి స్నేహితులకు సంతాపం తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల వ్యవస్థాపకులు విఠల్ రావు, ఉపాధ్యాయులు మల్లికార్జున్, ప్రభాకర్, నాగమ్మ, నారాయణ, అంబర్నాథ్, బ్రహ్మయ్య, పద్మమ్మ, రామ్ చరణ్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

40 ఏళ్ల తర్వాత కలుసుకున్న స్నేహితులు

పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1983–85 విద్యా సంవత్సరంలో ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థుల బృందం ఆదివారం ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలలో విద్యాబోధన చేసిన ఉపాధ్యాయులను సన్మానించి, వారి ఆశీర్వాదం తీసుకున్నారు. దాదాపు 40 ఏళ్ల తర్వాత కలుసుకోవడంతో భావోద్వేగానికి లోనయ్యారు. కార్యక్రమంలో రిటైర్డ్ ప్రిన్సిపల్ విఠల్ రావు నామాజీ, పోలప్ప, విఠల్ రావు ఆర్య, బుగ్గప్ప, లక్ష్మీనారాయణ, వెంకటమ్మ, దౌలత్, మల్లికార్జున్, బన్ని కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించాలి

నారాయణపేట రూరల్: విద్యార్థులకు చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని బీసీ జాగృతి సేన రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రూ.12 వేల కోట్లు తక్షణమే విడుదల చేసి, మిగతా బకాయిలను విడతల వారీగా ఇవ్వాలని కోరారు. ప్రజాపాలన.. గొప్పపాలన అంటూ గొప్పలకు పోతున్న రాష్ట్ర ప్రభుత్వం, విద్యావ్యవస్థను నీరుకార్చడం అంటే భవిష్యత్ తరాల జీవితాలను అంధకారంలోకి నెట్టడమేనని మండిపడ్డారు. ప్రజాకర్షక పథకాలకు నిధులు కేటాయించి, విద్యార్థులకు మాత్రం మొండిచెయ్యి చూపడం సరికాదన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నిధులు విడుదల చేయాలని కోరారు.

పార్టీ బలోపేతానికి కృషి చేద్దాం

దామరగిద్ద: బూత్ స్థాయి సేవా కార్యక్రమాలతో పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరం కృషి చేద్దామని బీజేపీ మండల అధ్యక్షుడు సంజీవ్‌గౌడ్, బీజేవైఎం రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యుడు చంద్రశేఖర్ రెడ్డి, వెంకట్రాములు గౌడ్, సీనియర్ నాయకులు గోపాల్‌రావ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని సేవా పక్షం కార్యశాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 17న ప్రధాని మోదీ జన్మదినాన్ని ప్రతి బూత్‌లో నిర్వహించాలని అలాగే కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. పార్టీ కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి రైతుల భూమి అప్పగింత



ఒప్పంద పత్రాలపై సంతకాలు చేస్తున్న రైతులు

నారాయణపేట రూరల్: మక్తల్–నారాయణపేట–కొడంగల్ ఎత్తిపోతల పథకంలో భూములు కోల్పోతున్న రైతులు తమ భూములను స్వచ్ఛందంగా ప్రభుత్వానికి అప్పగించారు. ఈ మేరకు మండలంలోని పేరపల్ల గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఆదివారం సాయంత్రం ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎకరానికి రూ.20 లక్షలు నష్టపరిహారం ఇస్తామని ప్రకటించడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తూ మిఠాయిలు పంపిణీ చేసుకున్నారు. అనంతరం భూనిర్వాసితుల నుంచి ఒప్పంద పత్రాలను నారాయణపేట తహసీల్దార్ అమరేందర్ కృష్ణ ఆధ్వర్యంలో అధికారులు స్వీకరించారు. కార్యక్రమంలో భూ నిర్వాసితుల సంఘం నాయకులు వెంకట్రామిరెడ్డి, గోపాల్, బలరాం, అంజి, భీమప్ప, అంజప్ప, హనుమంతు, నరసింహులు పాల్గొన్నారు.

శ్మశానవాటికలకు దారి ఏర్పాటు చేయండి



పగిడిమారిలో అంత్యక్రియలకు వాగులో నడుచుకుంటూ వెళ్తున్న గ్రామస్తులు (ఫైల్)

ఊట్కూరు: మండలంలోని పగిడిమారి గ్రామంలో శ్మశాన వాటికకు దారి ఏర్పాటు చేయాలని బీఎస్పీ నాయకులు గౌతమ్, మాజీ ఎంపీటీసీ కిరణ్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. మండలంలోని పగిడిమారి, పెద్దజట్రం, ఊట్కూరు తదితర గ్రామాలలో శ్మశాన వాటికకు దారి సరిగా లేకపోవడంతో అంత్యక్రియలు నిర్వహించడానికి కూడా ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. పగిడిమారి గ్రామంలో గ్రామ శివారులోని శ్మశాన వాటికకు వెళ్లడానికి వాగులో నుంచి వెళ్లాల్సిన దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి శ్మశాన వాటికకు వెళ్లే దారిని మరమ్మతు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ప్రభుత్వాస్పత్రిలో నీటి కష్టాలు



జిల్లా జనరల్ ఆసుపత్రి

నారాయణపేట క్రైం: పేట పరిధిలోని అప్పంపల్లి వద్ద ఉన్న జిల్లా మెడికల్ కాలేజ్, జనరల్ ఆస్పత్రిలో గత నాలుగు రోజులుగా తీవ్ర నీటి ఎద్దడితో రోగులు సతమతమవుతున్నారు. ఆస్పత్రిలో బోరు బావి లేకపోవడంతో మిషన్ భగీరథ నీటి పైప్‌లైన్ ద్వారా నీటి సరఫరా జరుగుతుంది. అయితే ఈనెల 11న క్రిస్టియన్ పల్లి వద్ద రోడ్డు విస్తరణ పనులలో భాగంగా భగీరథ పైప్‌లైన్ మార్పుల కోసం నీటి సరఫరా నిలిపేశారు. దీంతో రోగులు నీటి ఎద్దడితో తీవ్ర కష్టాలు ఎదుర్కొంటున్నారు. ఆస్పత్రిలో ల్యాబ్, క్లీనింగ్, మరుగుదొడ్లు వినియోగం, తదితర అవసరాలకు కలిపి దాదాపు రోజుకు 10 ట్యాంకర్ల నీరు అవసరమవుతుంది. అయితే నీటి సరఫరా లేకపోవడంతో మరుగు దొడ్లను మూసి తాళం వేసి ఉంచారు. దీంతో రోగులు, సిబ్బంది వ్యక్తిగత అవసరాల కోసం బయటకు వెళ్లాల్సిన పరిస్థితి దాపరిల్లింది. అయితే ఆదివారం సాయంత్రం భగీరథ నీరు సరఫరా కావడంతో సమస్య సద్దుమణిగిందని ఆసుపత్రి అధికారులు తెలిపారు.

ఉపాధ్యాయులకు రాష్ట్రస్థాయి పురస్కారాలు



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న సభ్యులు

కోస్గి రూరల్: అంకిత భావంతో పనిచేస్తూ విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దిన కోస్గికి చెందిన ఉపాధ్యాయులను లయన్స్ క్లబ్ అఫ్ ఇంటర్‌నేషనల్ రాష్ట్ర స్థాయిలో సన్మానం చేసి అభినందిచారు. ఆదివారం పాలమూరు జిల్లాలోని అన్నపూర్ణ గార్డెన్‌లో శిక్షక్ వందనం పేరుతో గురుపూజోత్సవం నిర్వహించారు. ఈ క్రమంలో కోస్గి మండల పరిధిలోని మీర్జాపూర్ ఉన్నత పాఠశాలకు చెందిన వార్ల మల్లేషం విద్యార్థులకు చదువుతో పాటు , ప్రకృతిని కాపాడే సైనికులుగా తీర్చిదిద్దడం , గుండుమాల్ మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో భౌతికశాస్త్ర బోధకుడిగా పని చేస్తున్న రవీందర్‌రెడ్డి విద్యార్థులను ఆత్మ విశ్వాసం గల నాయకులను తయారు చేసినందుకు అభినందించి పూల మాలలు శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ గవర్నర్ మహేందర్‌కుమార్ రెడ్డి , ఆచార్య కశిరెడ్డి వెంకట్‌రెడ్డి , కోస్గి లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి , కోశాధికారి వెంకట్రాములు, నాగులపల్లి శ్రీనివాసులు ఉన్నారు.

ఉపాధ్యాయులకు ఘన సన్మానం

మక్తల్: జిల్లా కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో లయన్స్ క్లబ్ బీమా అధ్యక్షుడు సత్య అంజనేయులు ఆధ్వర్యంలో గోల్లపల్లి పాఠశాలల్లో పని చేస్తున్న ఇందిరా, వద్వాట్ పాఠశాలల్లో పని చేస్తున్న వెంకటయ్యను ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేసి వారిని ఘనంగా సన్మానించి మెమోంటో అందజేశారు.

ధన్వాడ వాసికి విశ్వకర్మ జాతీయ పురస్కారం



పురస్కారం అందుకుంటున్న బాలకృష్ణ గౌడ్

ధన్వాడ: మండల కేంద్రనికి చెందిన మొల్కమొళ్ల బాలకృష్ణగౌడ్ విశ్వకర్మ జాతీయ పుస్కారం అందుకున్నారు. ఆదివారం సిద్ధిపేట జిల్లాలోని హుస్నాబాద్ రాజ్యలక్ష్మి కన్వెన్షన్‌హాల్‌లో శ్రీ విరాట్ విశ్వకర్మ విజ్ఞాన ఆధ్యాత్మిక ధార్మిక కళా పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఈ పురస్కారం అందుకున్నారు. అలాగే తెలుగు ఇండియన్ కల్చరల్ బుక్‌ఆఫ్ వరల్డ్ రికార్డ్‌లో పేరు నమోదు చేసుకున్నారు. ఆధ్యాత్మిక ధార్మిక కళా పరిషత్ వారు వివిధ రంగాల్లో విశేషంగా సేవలందిస్తున్న వారికి విశ్వకర్మ జాతీయ పురస్కారాలను ప్రదానం చేస్తారని ఆయన తెలిపారు. విశ్వకర్మ జాతీయ పురస్కార కార్యక్రమంలో గిన్నిస్ వరల్డ్ రికార్డు గ్రహీత బతుకమ్మ తల్లి గ్రంథకర్త బ్రహ్మశ్రీ శాంతిక్రిష్ణ ఆచార్య, చింతకుంట దేవస్థాన పీఠాధిపతులు విశ్వబ్రహ్మ వీరధర్మ స్వాముల వారి చేతుల మీదుగా అవార్డు అందుకోవడం సంతోషంగా ఉందని అవార్డు గ్రహీత తెలిపారు.

జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ



బంగారు పతకాలతో చిన్నారులు

నారాయణపేట రూరల్: బ్రేవ్ యూత్ మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఆదివారం మహారాష్ట్రలోని ముంబై (బివండి)లో నిర్వహించిన జాతీయస్థాయి మార్షల్ ఆర్ట్స్ చాంపియన్‌షిప్ పోటీలలో జిల్లా విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. పట్టణంలోని మాస్టర్ కేశవ్ కరాటే అకాడమీలో శిక్షణ పొందుతున్న ఆరాధ్య బాలికల అండర్–12 కటాస్ విభాగంలో, భువనేష్ అండర్–8 కటాస్ విభాగంలో, శ్యాసన్ పల్లికి చెందిన కార్తీక్ అండర్–14 కటాస్ విభాగంలో బంగారు పతకాలు సాధించారు. అదేవిధంగా అండర్–12 కుమిటి విభాగంలో భాను, అండర్–14 కుమిటి విభాగంలో దామరగిద్దకు చెందిన శివశంకర్ సైతం బంగారు పతకాలు సాధించారు. పతకాలు సాధించిన విద్యార్థులకు చీఫ్ ఆర్గనైజర్ రాజారామ్ దేవసాని, అశోక్ దేవసాని అవార్డు అందజేశారు.